క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి కిరణ్‌కుమార్

ఇచ్చోడ: గ్రామీణులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని దాబా(కే), బాదిగూడ గ్రామాల్లో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి మందులు అందజేశారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీళ్ల ట్యాంకులు, కొబ్బరి చిప్పలు, పూలకుండీల్లో నీటి నిల్వలు ఉండటం వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. పలు ఇళ్లల్లో ఉన్న నీటి నిల్వలను తొలగించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ ప్రశాంత్, హెల్త్ అసిస్టెంట్లు రాథోడ్ కైలాస్, ఉత్తం, సుభాష్, సిబ్బంది వసంత్, సుభాష్ ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం



ప్రారంభిస్తున్న హెచ్‌ఎం స్వర్ణలత

ఇచ్చోడ: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మేడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎం స్వర్ణలత మంగళవారం ఆటల పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల పోటీల్లో రాణించాలన్నారు. మూడు రోజుల పాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, క్యారమ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి పంద్రాగస్టు రోజున బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడలో తిరంగా యాత్ర



జాతీయ జెండాలతో ర్యాలీ బీజేపీ నాయకులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు. జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ చేపట్టారు. సిరిచెల్మ చౌరస్తా నుంచి ప్రారంభమైన యాత్ర అంబేడ్కర్, కుమురం భీం, శివాజీచౌక్ నుంచి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ స్వాతంత్ర దినో త్సవం సందర్భంగా ఘర్ ఘర్‌కో తిరంగా అనే నినాదంతో యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు మంగళవారం జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రజల్లో జాతీయభావం పెంపొందించేందుకు ర్యాలీ నిర్వహించినట్లు పోరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకన్న యాదవ్, శంకర్, రమణ, శ్రీనివాస్, కేవల్‌సింగ్, ఉత్తం, సుందర్, ప్రదీప్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం

ఆదిలాబాద్‌రూరల్: అనారోగ్యం బారినపడకుండా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి సర్వరాజ్ అన్నారు. మండలంలోని యాపల్‌గూడ హైస్కూల్‌లో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. భోజనం చేసే ముందు, భోజనం చేసిన అనంతరం చేతులను సబ్బుతో శుభ్రంగా కడుకోవాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ కృష్ణవేణి, ఆరోగ్య కార్యకర్త శ్రీదేవి, గంగమ్మ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్టు



స్క్రీనింగ్ టెస్టు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో మంగళవారం సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధి స్క్రీనింగ్ టెస్టు నిర్వహించారు. 120 మంది విద్యార్థుల రక్త నమునాలు సేకరించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారినపడకుండా పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. అనారోగ్యాల బారిన పడితే సమీప పీహెచ్‌సీలు, రిమ్స్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం. శివకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూగజీవాలు బలి

- విద్యుత్ షాక్‌తో మృత్యువాత
- పరిహారం అందడంలో అవగాహన కరువు
- నష్టపోతున్న పశు యజమానులు



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పశువులు (ఫైల్)

తలమడుగు: ప్రకృతి విపత్తులు, మానవ తప్పిదాలకు మూగజీవాలు మృత్యువాత పడుతున్నా యి. ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసిన సమయంలో పిడుగులు, నిప్పులు కురిపించడం, విద్యుత్ తీగలు తెగిబడడం, వ్యవసాయ బావులు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ షాక్‌తోపాటు మనుష ల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా అనేక పశువులు చని పోతున్నాయి. విద్యుత్ శాఖ నుంచి పరిహారం అందడంలో యజమానులకు అవగాహన లేకుండా పోయింది. దీంతో పరిహారం అందక నష్టపోతున్నారు.

మనుషులకు ప్రమాదం జరిగితే..

విద్యుత్ ప్రమాదం వల్ల మనుషులకు మరణించిన అంగవైకల్యం కలిగిన వెంటనే ప్రమాద విషయాన్ని విద్యుత్ అధికారులకు తెలపాలి. వైద్యం, ఇతరత్రా ఖర్చుల వివరాలు సంబంధించిన ధ్రువపత్రాలు దరఖాస్తుకు జతపర్చి ఏఈకి అందజేయాలి. పరిశీలన అనంతరం పరిహారం మంజూరు చేస్తారు. చనిపోయినట్లయితే శాశ్వత పరిష్కారం కింద పరిహారం అందుతుంది. మూగజీవాలకు పశువులు విద్యుత్‌షాక్‌తో చనిపోతే ముందుగా సంబంధిత శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వాలి. అనంతరం పశువైద్యాధికారి నుంచి దాని ఖరీదు తెలిపే పత్రం మృతి, ధ్రువీకరణపత్రం తీసుకోవాలి. పరిశీలించిన అనంతరం పరిహారం పశు యజమానికి అందుతుంది.

ఇలా చేస్తే పరిహారం..

విద్యుత్ ప్రమాదం జరిగిన వెంటనే పరిహారం కోసం పోలీసులకు ఫిర్యాదు చేయాలి. కేసు నమోదైన తర్వాత పశు వైద్యులు సహాయంతో పంచనామా చేయించాలి. పరిహారం పొందేందుకు కేసుకు సంబంధించిన పత్రాలతో విద్యుత్‌శాఖ సహాయక ఇంజనీరింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి. మరణ ధ్రువీకరణ పత్రం, ఎఫ్‌ఆర్‌ఐ పంచనామా నివేదిక, ఆధార్ కార్డు, బ్యాంక్ పుస్తకం తదితర కాపీలు జతపర్చి అందజేయాలి. ఏఈ నుంచి పత్రాలు ఏడీకి చేరి అధికారుల పరిశీలనకు వెళ్తాయి. ఆ తర్వాత నష్టపరిహారం బాధితులకు బ్యాంకు ఖాతాలో జమవుతుంది.

మచ్చుకు కొన్ని..

- తలమడుగు మండలంలోని కప్పర్‌దేవి గ్రామనికి చెందిన కోరంగే జంగుకు చెందిన ఎద్దు ట్రాన్స్‌పార్మర్ వద్ద విద్యుత్ తీగలు తగిలి మృతి చెందింది. దీ ని విలువ దాదాపు రూ.50 వేల వరకు ఉంటుంది.
- కుచులాపూర్ గ్రామానికి చెందిన జక్కుల సురేందర్‌కు చెందిన గెదే కరెంట్ షాక్‌తో మృతి చెందింది. దీని విలువ రూ.15 వేలు ఉంటుంది.
- దేవపూర్ గ్రామానికి చెందిన నాయిని లింగన్న ఎద్దు విద్యుత్ షాక్‌తో మృత్యువాతపడింది. దీని విలువ దాదాపు రూ.25 వేలు ఉంటుంది.
- దేవాపూర్ గ్రామానికి చెందిన సయ్యద్ నజీర్‌కు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో చనిపోయింది. గొల్లేటి స్వామికి చెందిన రెండు గొర్రెలు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌తో చనిపోయాయి. వీటి విలువ రూ.20 వేలు, సుంకిడి గ్రామానికి చెందిన చిన్న గంగారెడ్డి ఎద్దు విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. దీని విలువ రూ.50 వేల వరకు ఉంటుంది.

పరిహారం అందుతుంది

విద్యుత్ ప్రమాద స్థాయిని బట్టి పరిహారం ఉంటుంది. నిబంధనల ప్రకారం అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. మూగజీవాల విషయంలో పశువైద్యాధికారి ధ్రువీకరణ పత్రాలు పరిగణనలోకి తీసుకుంటాం. ప్రమాదాల బారిన పడిన వెంటనే అధికారులకు తెలపాలి. గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

– శ్రీనివాస్, విద్యుత్ ఏఈ

నిర్ధారణ అయితేనే..

మూగజీవాలు విద్యుత్ ప్రమాదానికి గురైతే వెంటనే పశు వైద్యాధికారులకు సమాచారం ఇవ్వాలి. అనంతరం కళేబరానికి నిజనిర్ధారణ పరీక్షలు చేస్తాం. విద్యుత్ షాక్‌తోనా మరేదైనా కారణం ఉందా అని పరిశీలిస్తాం. అనంతరం మరణధ్రువీకరణ పత్రం పరీక్షకు సంబంధించిన పత్రాలు పశు యజమానికి అందజేస్తాం.

– లావణ్య, పశు వైద్యాధికారి

వర్షాలు లేక మొలకెత్తలె..

- జేఎస్ 335 రకం సోయా విత్తనాలపై స్పష్టం చేసిన శాస్త్రవేత్త
- రెండు రోజుల్లో కమిటీ నివేదిక



రుయ్యాడిలో గోనేల నర్సింలు పొలంలో మొలకెత్తని సోయా పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్)

ఇచ్చోడ: సోయా విత్తనాలు మొలకెత్తలేదంటూ తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన రైతు గోనేల నర్సింలు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ రాజర్షి షాకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈమేరకు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి వివరణ కోరగా, జిల్లాకేంద్రంలోని జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీ తయారు చేసిన జేఎస్ 335 రకం సోయా విత్తనాలు దాదాపు 200 క్వింటాళ్లు విక్రయించినట్లు తెలిపారు. విత్తనాలు విత్తుకున్న నాటి నుంచి వర్షాలు కురవని కారణంగా సోయా పంట మొలకెత్తలేదని స్థానిక వ్యవసాయ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా శాస్త్రవేత్తలు మొలకెత్తని పంటను పరిశీలించాం. విత్తనాలు కొనుగోలు సమయంలో కటఫ్ తేదీ లోపు విత్తుకోవాలని సూచించాం. కానీ వర్షాలు లేని కారణంగా విత్తుకోకుండా సదరు రైతు ఆలస్యం చేశాడు. దీనిపై కమిటీ వేశామని, రెండు రోజుల్లో నివేదిక రానుందని శాస్త్రవేత్త తెలిపారు. ఈరకం సోయా విత్తనాలు మొలకెత్తలేదని మిగతా రైతులెవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

జూలై 14న సోయా విత్తుకున్న..

జూన్ 3న ఆదిలాబాద్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీ నుంచి జేఎస్ 335 రకం ఐదు సోయా విత్తనాల గన్నీ బ్యాగులు కొన్నాను. సరైన వర్షాలు లేక ఆలస్యంగా జూలై 14న విత్తనాలు విత్తుకున్నా. తర్వాత వారం వరకు వర్షం పడలేదు. నాలుగెకరాల్లో సోయా, కందులు విత్తగా, కందులు మొలకెత్తాయి. సోయా మాత్రం మొలకెత్తలేదు. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాను.

– గోనేల నర్సింలు, రుయ్యాడి, మొలకెత్తని సోయా రైతు

పాఠశాల హెడ్‌బాయ్, గర్ల్ ఎన్నిక



ఎన్నికలో పాల్గొన్న విద్యార్థులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ ఆదర్శ పాఠశాలలో మంగళవారం హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్ కోసం ఎన్నిక నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. సెక్యూరిటీ నిర్వహణ కోసం 100 మంది ఎన్‌సీసీ కేడెట్స్, స్కౌట్స్ అండ్ గైడ్స్‌లను నియమించారు. నలుగురు విద్యార్థులు పోటీలో నిలువగా, ఉదయం నుంచి విద్యార్థులు ప్రచార సరళి కొనసాగించారు. మధ్యాహ్నం అనంతరం ఓటింగ్ నిర్వహించారు. విద్యార్థులు ఇందులో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం గెలుపొందిన అభ్యర్థులను ప్రకటించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న డాక్టర్ రామ్‌గోపాల్‌వర్మ

భీంపూర్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రామ్‌గోపాల్ వర్మ పేర్కొన్నారు. మండలంలోని వాడేగామ్, రాజ్‌ఘడ్, బెల్సారి రాంపూర్ గ్రామాల రైతులు, మహిళలతో మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు కూరగాయల సాగుకు సహకారం అందించడం, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, జీవన ప్రమాణాలు పెంపొందించడం కోసం కృషి చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. మహిత స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్‌రావు మాట్లాడుతూ 100 మంది రైతులకు వంద ఎకరాలకు కూరగాయల సాగు కోసం సంస్థ ఆధ్వర్యంలో నారు, విత్తనాలు, ఎరువులు అందిస్తోందన్నారు. 50 మంది మహిళా రైతులకు 50 గేదెలను అందించి పాడి పశుపోషణపై అవగాహన కల్పిస్తోందని తెలిపారు. శాస్త్రవేత్తలు డాక్టర్ రఘువీర్, శివచరణ్, సురేష్, సునీల్ కుమార్, సభ్యులు ఆదర్శ్, ప్రవీణ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలు



జెండా ఎగురవేస్తున్న మున్సిఫ్

బోథ్: మండల కేంద్రంలో ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మున్సిఫ్ జెండాను ఎగురవేశారు. విద్యారంగ సమస్యలపై ప్రభుత్వంతో పోరాడతామన్నారు. బి.గోవర్ధన్, నరేశ్, కార్తీక్, ముక్రమ్, శివ, ఆరుణ్, సిద్దార్థ్, నిశాంత్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో పల్లెలు అధ్వానం

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: కేసీఆర్ హయాంలో పల్లెలు పచ్చదనంతో కళకళలాడగా, కాంగ్రెస్ పాలనలో అధ్వానంగా మారాయని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మండలంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో పచ్చగా మారిన పల్లెలు కాంగ్రెస్ పాలనలో ఎడారిగా మారుతున్నాయన్నారు. పల్లెల్లో దోమల బెడదతో మలేరియా, చికెన్ గున్యా, విష జ్వరాలతో ప్రజలు మళ్లీ మంచానికి పరిమితమవుతున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, పాలనపై నిబద్ధత ఉంటే ఇచ్చిన హామీ మేరకు ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలన్నారు. మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, అనిల్ అన్న యువ సైన్యం అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, ఆదుముల్ల భూషణ్, ప్రతాప్‌సింగ్, సురేందర్ రాథోడ్, గులాబ్‌సింగ్, సంతోష్‌సింగ్, సర్పంచులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో భారీ వాహనాల రాకపోకలకు ప్రభుత్వం అనుమతించడంపై కాంగ్రెస్ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఉట్నూర్ ఐబీలో సీఎం రేవంత్‌రెడ్డి, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్, ఆర్టీఏ మెంబర్ దూట రాజేశ్వర్, వైస్ చైర్మన్ జైవంత్ తదితరులు పాల్గొన్నారు.

బోరు ప్రారంభం

జైనథ్: మండలంలోని మాకోడ గ్రామంలో ఎస్డీఎఫ్ నిధులు రూ.లక్ష వ్యయంతో బోరును గ్రామస్తులు, బీజేపీ నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు లోక కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలతోపాటు గ్రామాల్లో మౌలిక వసతులు సమకూర్చేందుకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ కృషి చేస్తున్నారని అన్నారు. ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, గ్రామపెద్దలు ఉషారెడ్డి, గంగారెడ్డి, లింగన్న, భగవన్‌రెడ్డి పాల్గొన్నారు.

నగదు విరాళం

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుకు స్పోర్ట్స్ యూనిఫాం కోసం గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు నక్క ధనుంజయ్ రూ.8 వేల నగదు విరాళంగా అందించాడు. ఈ నగదును ఉపాధ్యాయులకు అందజేశారు. మాజీ సర్పంచ్ పోతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదానం

బోథ్: మండల కేంద్రంలోని పరిచయ గార్డెన్‌లో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ డైరెక్టర్ చట్ల ఉమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. యువకులు, సామాజిక కార్యకర్తలు అధికంగా తరలివచ్చి రక్తదానం చేయాలని కోరారు.

దుస్తులు, షూ పంపిణీ

బేల: మండలకేంద్రంలోని ఉర్దూ మీడియం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం హ్యూమన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 120 మంది విద్యార్థులకు దుస్తులు, షూ పంపిణీ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంతేఖాబ్ ఆలం.. విద్యార్థులకు వీటిని అందజేశారు. అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ భాను, సభ్యులు, హెచ్‌ఎం, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

నార్నూర్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని హెచ్‌ఎం జాదవ్ విట్టల్ అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. పీడీ ఆడే విశ్వనాథ్, వార్డెన్ వనిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా తీజ్ పండగ

నేరడిగొండ: మండల కేంద్రంలోని మధురనగర్ కాలనీలో కైతీ లంబాడీలు తీజ్ పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉపవాసం ఉండి సంప్రదాయ పాటలు పాడుతూ అడవికి వెళ్లి మట్టి తెచ్చారు. ఆ మట్టితో ఒక ప్రతిమను తయారు చేసి దానికి పూజలు చేశారు. అనంతరం సంప్రదాయ నృత్యాలు చేశారు.

పాఠశాలలో యోగా శిక్షణ

బోథ్: ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం సొనాల ఆయుష్ యోగా శిక్షకురాలు మునిగెల యోగిత విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ప్రిన్సిపాల్ సురాధ, ఉపాధ్యాయులు దత్తాద్రి, వ్యాయామ ఉపాధ్యాయురాలు శృతి, తదితరులు పాల్గొన్నారు.

యూరియా లేక వెనుదిరిగిన రైతులు

బోథ్: మండల కేంద్రంలో ప్రాథమిక సహకార గిడ్డంగిలో యూరియా లేకపోవడంతో మంగళవారం రైతులు వెనుదిరిగారు. సోమవారం సాయంత్రం వరకు యూరియాను రైతులకు అందించామని పీఏసీఎస్ సిబ్బంది తెలిపారు. స్టాక్ అయిపోవడంతో పలువురు రైతులు గోదామును వచ్చి వెళ్లినట్లు పేర్కొన్నారు. కాగా బుధవారం నుంచి యూరియా అందుబాటులో ఉంటుందన్నారు.

ఘనంగా లైబ్రేరియన్స్ డే

ఉట్నూర్‌రూరల్: గ్రంథాలయశాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఉట్నూర్ గ్రంథాలయంలో లైబ్రేరియన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిప్రసాద్ ముందుగా ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్

బోథ్: జాతీయ సేవా పథకంలో భాగంగా మండల కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు ఉన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి

బజార్‌హత్నూర్: కేంద్ర ఎన్నికల సంఘం.. రాజ్యాంగాన్ని గౌరవించాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లేపూల నర్సయ్య పేర్కొన్నారు. బీహార్ రాష్ట్రంలో ఓట్ల గల్లంతుపై రాహుల్‌గాంధీ చేపట్టిన ఓటు చోర్ నిరసన కార్యక్రమానికి మద్దతుగా మండల కేంద్రంలో మంగళవారం గోడప్రతులను ప్రదర్శించారు. కాంగ్రెస్ నేతలు పాండురంగ్, కిషన్, రమణ, పాండు, శివుడు, రమేశ్, శ్రీనివాస్, మహబూబ్, రవి, సల్మాన్ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీగణపతి హోమం



హోమంలో పాల్గొన్న దంపతులు

బోథ్: మండల కేంద్రంలోని శ్రీ ప్రసన్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం లక్ష్మీగణపతి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా అంగారక చతుర్థి సందర్భంగా హోమం చేపట్టారు. పండితులు సదానంద శర్మ ఆధ్వర్యంలో జరిగింది. పలువురు దంపతులు పాల్గొన్నారు.

యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి

బోథ్: జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అనిల్, విద్యార్థులు మంగళవారం నాయబ్ తహసీల్దార్ మల్లేశ్‌కు వినతిపత్రం అందించారు. జిల్లాలో యూనివర్సిటీ లేకపోవడంతో విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. విక్రమ్ రాథోడ్, చంద్రకాంత్, విశాల్, ఆదిత్య, నితిన్ ఉన్నారు.

విద్యుత్ సమస్యలపై దృష్టి సారించాలి

సాత్నాల: విద్యుత్ సమస్యలపై దృష్టిసారించాలని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. భోరజ్ మండల కేంద్రంలో విద్యుత్‌శాఖ ఉద్యోగులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగులకు తల్లి లాంటి సంస్థను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. 11 కేవీ, ఎల్‌టీ లైన్ లూజ్‌లైన్‌ను గుర్తించి అక్కడ అవసరమయ్యే మిడిల్ పోల్ ఏర్పాటు చేయాలన్నారు. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల కన్నా ఎక్కువ వచ్చే సర్వీసులను గుర్తించి, వాటికి వచ్చే బిల్లులు కమర్షియల్ మీటర్ల బిల్లుల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. ఉదయం బిల్లులు వసూలు చేసి, మధ్యాహ్న సమయంలో 11 కేవీ లైన్‌లో ఉన్న చెట్లకొమ్మలు తొలగించాలన్నారు. సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మనోజ్, లైన్ ఇన్‌స్పెక్టర్లు నజీర్,సంతోష్, ప్రేమ్‌కుమార్, ప్రభాకర్, నరేశ్, సతీశ్, దేవదాస్, వెంకన్న పాల్గొన్నారు.

కంచె ఏర్పాటు చేశారు

సాక్షి ఎఫెక్ట్..



ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లోని మోమిన్‌పుర కాలనీలో నాసిరకం గద్దె నిర్మాణం, కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఈనెల 6న సాక్షిలో ప్రచురితమైన 'ప్రమాదకరంగా స్తంభాలు' కథనానికి స్పందించిన అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ గద్దెకు పూతలు పూయడంతోపాటు చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారానికి చొరవచూపిన 'సాక్షి'కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్డీవోకు సన్మానం

కైలాస్‌నగర్: అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి ప్రతినిధులు ఆదిలాబాద్ ఆర్డీవో స్రవంతిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. అన్యాక్రాంతమైన ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములను తిరిగి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మిషన్ శక్తి కోఆర్డినేటర్ యశోద

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని మిషన్ శక్తి జిల్లా మహిళా సాధికార కేంద్రం కోఆర్డినేటర్ యశోద అన్నారు. పట్టణంలోని అర్బన్ కేజీబీవీలో రుతుక్రమ ఆరోగ్యంపై మంగళవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని పేర్కొన్నారు. సమస్యలపై భయాన్ని తగ్గించుకోవాలని సూచించారు. స్వేచ్ఛగా మాట్లాడే వాతావరణాన్ని సృష్టించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కోటేశ్వర్, కృష్ణవేణి, కేజీబీవీ ప్రత్యేక అధికారి దీప్తి తదితరులు పాల్గొన్నారు.